క్లుప్తంగా

నేటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

చెరుకుపల్లి: విద్యుత్ సరఫరాకు మంగళవారం నుంచి శనివారం వరకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏడీఈ శ్యామ్ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెరుకుపల్లిలో జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని ఆయన పేర్కొన్నారు.

వారిపై చర్యలు తీసుకోండి

పిట్టలవానిపాలెం: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం శిథిల స్థితికి చేర్చిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ బహుళార్ధక సేవా సమితి గౌరవ అధ్యక్షుడు గొర్రుముచ్చు ఆనందరావు డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహం రూపురేఖలు మారిపోయాయని, స్థానికంగా అపరిశుభ్ర వాతావరణం నెలకొందని తెలిపారు. ఇందుకు కారకులపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. మండల పరిషత్ కో–ఆప్షన్ మాజీ సభ్యులు మద్దాల డేవిడ్, బీఎస్పీ మండలాధ్యక్షులు చెరుకూరి ఆనంద్ మోహన్, అంబేడ్కర్ సంఘ సభ్యులు, అల్లూరు మాజీ సర్పంచ్ మేరుగ ధర్మారావు పాల్గొన్నారు.

నగరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా రవికుమార్



నగరం: నగరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)పర్సన్ ఇన్‌చార్జ్‌గా మత్తి రవి కుమార్ నియమితులైనట్లు సోమవారం ఆయన విలేకరులకు తెలిపారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా మంగళవారం ప్రమాణస్వీకారం చేయనున్నట్లు పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్యకు రవికుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పీఏసీఎస్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

భట్టిప్రోలు పంచాయతీ కార్యదర్శిగా శ్రీనివాసరావు

భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామ పంచాయతీకి పూర్తిస్థాయి కార్యదర్శిగా కోట శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన దుగ్గిరాల మండలం చిలువూరు పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ సీహెచ్ శేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. భట్టిప్రోలు గ్రామ పంచాయతీకి ఏడాదిగా పూర్తిస్థాయి కార్యదర్శి లేక పోవడంతో ఇన్‌చార్జ్‌ల పాలన కొనసాగుతూ వచ్చింది.

60 మందికి కంటి వైద్యపరీక్షలు



పిట్టలవానిపాలెం: అలకాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ మంతెన గంగరాజు సహకారంతో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో 60 మందికి ఉచిత నేత్ర పరీక్షలు సోమవారం నిర్వహించారు. సిబ్బంది సరళ, బాజీ, బాపూజీ, రాజేష్, సాయిలక్ష్మి తదితరులు ఉన్నారు.

4న కట్లమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు గ్రామ దేవత కట్లమ్మ తల్లి ఆలయ 25వ వార్షిక మహోత్సవం మే 4, 5 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థాన అభివృద్ధి కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. 4న అమ్మవారికి చద్ది నైవేద్యాలు, సాయంత్రం లక్ష మల్లెల పూజ, 5న నిత్య పూజ, పావన నదీ స్నానం, సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కుమార్తె సహా తల్లి అదృశ్యం

తెనాలిరూరల్: కుమార్తె సహా తల్లి అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మోరిస్ పేట ఆర్ఆర్‌నగర్‌కు చెందిన బొర్రా మాధవి తన మూడేళ్ల కుమార్తెతో కలసి ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో భర్త శ్రీనివాసరావు త్రీ టౌన్ పోలీసులను సోమవారం రాత్రి ఆశ్రయించగా ఎస్ఐ ఎం. విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆదరణ లేక.. ఆదాయం రాక

- మట్టి కుండలు, పాత్రలకు తగ్గుతున్న ఆదరణ
- పెరిగిన తయారీ ఖర్చులు
- కులవృత్తిని వదులుకోలేక.. ఆదాయం లేక తప్పని అవస్థలు



కుండలు విక్రయిస్తున్న వృద్ధ మహిళలు..

బాపట్ల అర్బన్: వేసవిలో మట్టి కుండలకు ఉన్న డిమాండే వేరు. పేదోడి ఫ్రిడ్జ్‌గా పేరొందిన నిండు కుండలు ఈ సీజన్లో ప్రతి ఇంటిలో, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో గతంలో కనిపించేవి. ఎండిపోతున్న గొంతులకు కుండలోని నీరు అమృతంతో సమానం. కుమ్మర వృత్తిని నమ్ముకునే జీవించే వారికి కుండల వ్యాపారం లాభసాటిగా ఉండేది. ప్రస్తుతం కుండల తయారీపై ఆధారపడిన వారి ఆదాయం అంతంతమాత్రంగానే ఉంది. ఈ వృత్తి తప్ప.. వేరే వృత్తి తెలియని వారి పరిస్థితి ఎటూకా' కుండ' ఉంది. అక్కడక్కడా కొందరు కుండలు తయారు చేస్తూ..పట్టణ ప్రాంతాల్లో రోడ్ల మార్జిన్‌కి ఇరువైపులా అమ్మకుంటూ.. వచ్చిన దాంతో పొట్ట పోసుకుంటున్నారు. బాపట్ల జిల్లా పరిధిలో కుండలు తయారు చేస్తూ జీవిస్తున్న కుటుంబాలు వేల సంఖ్యలోనే ఉన్నాయి. కుమ్మరి వృత్తిని నమ్ముకొని మట్టితో రకరకాల వస్తువులు తయారు చేసి, విక్రయిస్తున్నారు. తెల్లవారుజాము నుంచి ఇంటిల్లిపాది కష్ట పడినా.. రోజుకు రూ.500 గిట్టుబాటు కాని దుస్థితి. ఒక్క కుండలనే కాదు.. ప్రమిదలు, ప్రతిమలు, గృహ అలంకార వస్తువులు, మట్టి బాటిళ్ల రకరకాల వస్తువులను పట్టణ ప్రాంతాల్లో అమ్ముతూ చాలా మంది మనకు కనిపిస్తారు. వీటి తయారీ ఖర్చులు కూడా ప్రస్తుతం పెరిగిపోయాయి. ఈ వృత్తి కన్నా కుటుంబంలోని ఇద్దరు కూలి పనికి పోతే..రోజుకి రూ.1000లపైనే సంపాదించుకుంటున్నారు. మరికొందరు నమ్ముకున్న చేతివృత్తిని వదులుకోలేక సరిపోని సంపాదనతో సర్దుకుపోతున్నారు.

తగ్గిన ఆదరణ..

ఒకప్పుడు కుమ్మరి లేని గ్రామం, కుండలేని ఇల్లు ఉండేది కాదు. ఏడాది పొడవునా ఇంటి అవసరాలకు కావాల్సిన పాత్రలన్నీ మట్టితో తయారుచేసి ఇచ్చేవారు. వివాహాలు, శుభకార్యాల సమయంలో మట్టి కుండలకు ప్రత్యేక స్థానం ఉండేది. ప్రస్తుతం కొన్ని కర్మక్రతువులకి, బోనాల కోసం ఇతరత్రా మొక్కుబడులు చెల్లింపులకు మాత్రమే మట్టి పాత్రలు వినియోగిస్తున్నారు. లోహపు పాత్రల వినియోగం పెరగడం, ఫ్రిడ్జ్‌ల వాడకం అధికమవడంతో.. కుండల వైపు కన్నెత్తి చూసే వారు కనిపించడం లేదు.

చలివేంద్రాల్లోనూ ప్లాస్టిక్ క్యాన్లే..

ఎండాకాలంలో వివిధ స్వచ్ఛంద సంస్థలు, దాతలు, కార్యాలయాల్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు చేస్తుంటారు. మట్టి కుండలను ఏర్పాటు చేసి, చల్లని నీరు అందిస్తుంటారు. పల్లెలు, పట్టణ ప్రధాన రహదారుల వెంట ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాల్లో కుండల స్థానంలో కూలింగ్ వాటర్ క్యాన్లు, వాటర్ కూలర్లు దర్శనమిస్తున్నాయి.

తగ్గిన విక్రయాలు..

ప్రతి ఇంటిలో ఫ్రిడ్జ్ అనేది సర్వసాధారణం అయిపోయింది. క్షణాల్లో బాటిళ్ల వాటర్ కూలింగ్ అవుతుండటంతో.. కుండల సంస్కృతి 90శాతం ఎక్కడా కనిపించడం లేదు. వివిధ కార్యాలయాల్లో కూడా కూలింగ్ వాటర్ క్యాన్లను వాడుతున్నారు. గతంలో మూడు నెలలు ఎండాకాలంలో రోజుకి 100 కుండలు అమ్ముడయ్యేవని.. ప్రస్తుతం రెండు మూడు కుండలు కూడా అమ్ముడుపోవడం లేదని వ్యాపారుల చెప్తున్నారు.

ఈ వృత్తి తప్ప.. వేరే పని రాదు



పూర్వం కుండల తయారీకి కావాల్సినంత మట్టి తవ్వుకొని తెచ్చుకునే వాళ్లం. కుండలు కాల్చేందుకు కర్రలు, పొట్టు కూడా దొరికేవి. ఇప్పుడు మట్టి ఒక్కో ట్రిప్పు రూ. 3,500, కర్రలు రూ.3వేలు, పొట్టు రూ.1000లు పెట్టి కొనుగోలు చేసి.. నలుగురం వారం పని చేస్తే 100 కుండలు తయారవుతాయి. కుండ రూ.100కు అమ్మినా రూ.10వేలు మాత్రమే వస్తాయి. కూలి కూడా గిట్టుబాటు కాదు.

– మోపర్తి శేషమ్మ, కుమ్మరిపాలెం, బాపట్ల

అకాల వర్షంతో రైతుల ఇక్కట్లు



పెసర్లంకలో ఆరబోసిన పసుపు పంటను కాపాడుకునే ప్రయత్నంలో రైతులు

భట్టిప్రోలు: వాతావరణ మార్పుల కారణంగా సోమవారం సాయంత్రం భట్టిప్రోలు మండలంలో అకాల వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై వాన పడింది. ఈ వర్షానికి మండలంలోని లంక గ్రామాల్లోని వాణిజ్య పంటలకు కొంతమేర నష్టం వాటిల్లింది. కల్లాల్లో ఆరబోసిన పసుపు, మొక్కజొన్న వర్షానికి తడిచిపోయింది. పంటలకు పట్టలు కప్పుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. పట్టాలపై వర్షపు నీరు భారీగా చేరింది. రహదారిలో నీరు నిలిచింది.



పంటపై కప్పిన పట్టలలో నిలిచిన వర్షపు నీరు

కలెక్టర్‌కు సత్కారం



కలెక్టర్ రంజిత్ బాషాను సత్కరిస్తున్న యూనియన్ నేతలు

బాపట్ల అర్బన్: జిల్లాలో కొత్తగా ఏర్పడ్డ ఎల్–3 యూనియన్ ప్రెసిడెంట్ పారి షాలేమురాజు, ఉపాధ్యక్షుడు దేవకొండ వెంకటేశ్వర్లు, సెక్రటరీ నల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి, జాయింట్ సెక్రటరీ కోడి రామకృష్ణ, ట్రెజరర్ సందెపాము రాంబాబు డీఆర్‌డీఏ పీడీ బి.అర్జునరావుతో కలిసి కలెక్టర్ పి.రంజిత్ బాషాను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. యూనియన్ అధ్యక్షుడు షాలేమురాజు మాట్లాడుతూ.. మండలాలకు స్త్రీ శక్తి భవనాలు ఏర్పాటుకు అవకాశం కల్పించాలని, సెర్ప్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

బ్రాహ్మణ సమైక్య అభివృద్ధికి పనిచేయాలి

– ఎమ్మెల్యే కోన రఘుపతి



ఎమ్మెల్యే కోన రఘుపతిని కలిసిన నూతన కార్యవర్గం

బాపట్ల: బ్రాహ్మణ సమైక్య అభివృద్ధికి అందరూ కలిసి పని చేయాలని ఎమ్మెల్యే కోన రఘుపతి సూచించారు. శ్రీ భావపురిబ్రాహ్మణ సమైక్య ఎన్నిక అనంతరం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కోన రఘుపతిని కలిశారు. అధ్యక్షుడిగా నిభానపూడి శ్రీహరి ప్రకాశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానికంగా నిర్వహించిన ఎన్నికలకు పోలింగ్ ఆఫీసర్‌గా ఓబెటి శ్రీనివాస్‌శర్మ, ఎ.చలపతిరావు, శిఖరం భుజగేంద్ర మౌళి వ్యవహరించారు. సమైక్య ఉపాధ్యక్షులుగా బొడ్డుపల్లి నారాయణ, కొలనుమోహన్ శ్రీనివాస్, కార్యదర్శి సోమరాజు శ్రీనివాస్, సహాయ కార్యదర్శి ఆవంచ రామ్‌గోపాల్, నల్లూరి రాఘవాచార్యులు, కోశాధికారిగా పూసపాటి శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎమ్మెల్యే కోన రఘుపతి అభినందించారు.

'స్పందన'తో సమస్యలు పరిష్కారం



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ పార్థసారథి

రేపల్లె: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, మాట్లాడారు. స్పందనకు 9 అర్జీలు అందాయన్నారు. కాలిబాటను సర్వేచేసి దారి చూపించాలని రెండు అర్జీలు, పాస్ బుక్‌కు 1, పేటేరు ఆంజనేయ స్వామి కాలనీలో గుర్తుతెలియని వ్యక్తులు చేస్తున్న మట్టితవ్వకాలు నిలుపుదల చేయాలని 1, ఔట్ సోర్సింగ్‌లో బదిలీకి 1, డ్రెయినేజ్ కాల్వను పూడిక తీయించాలని 1, రోడ్డుమార్గం ఇప్పించాలని మరో అర్జీ అందినట్లు చెప్పారు. సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా పరిశీలన జరిపి పరిష్కరిస్తామని చెప్పారు.

వైభవంగా కావూరమ్మ తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో కావూరు అమ్మవారు



ఆలయ ప్రాంగణంలో విద్యుత్ ప్రభ

చెరుకుపల్లి: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం కావూరమ్మ తిరునాళ్ల మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. కావూరు గ్రామంలో వేంచేసియున్న అమ్మవారి తిరునాళ్ల ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించి, డప్పు వాయిద్యాల నడుమ మహిళలు నైవేద్యాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో వివిధ సామాజిక వర్గాల వారు ఐదు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ శ్రీనివాస వర్మ తెలిపారు. అమ్మవారి ఆలయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

బాపట్ల అర్బన్: బాపట్ల గ్రామ దేవత పోలేరమ్మ తల్లి గుడిలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తుల సహాయ సహకారాలతో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు.

పోలేరమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు



దేశానికి పట్టుకొమ్మలు పల్లెలు



గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



గాంధీ, అంబేడ్కర్ నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ పద్మజ



దమ్మనవారిపాలెం సర్పంచ్, కార్యదర్శికి ప్రశంసా పత్రం..

భట్టిప్రోలు: దేశానికి పట్టుకొమ్మలు పల్లెలు అని భట్టిప్రోలు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వెల్లటూరు, ఓలేరు, పెసర్లంక సర్పంచులు చౌటూరి లక్ష్మి, మేరుగ రంగారావు, వేములపల్లి వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ సీహెచ్ శేఖర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాలు అభివృద్ధి చేందితేనే దేశాభివృద్ధి సాధ్యం

పిట్టలవానిపాలెం: గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశాభివృద్ధి సాధ్యముతుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కె.పద్మజ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో నిర్వహించే ప్రతి కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అందుకు సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, సిబ్బంది కృషిచేయాలని కోరారు. ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకు పంచాయతీ రాజ్ దినోత్సవాలను నిర్వహించినట్లు చెప్పారు. 1991 ఏప్రిల్ 24న స్థానిక సంస్థలకు రాజ్యాంగ భద్రత కల్పించడం జరిగిందని వివరించారు. ఎంపీపీ షేక్ బాజి, వైస్ ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, మంతెనవారి పాలెం ఎంపీటీసీ సభ్యురాలు రాహేలు, సర్పంచ్‌లు దబ్బకూటి మాధవరావు, మంతెన గంగరాజు, దోమ వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శులు వసుంధర, శ్రీనివాసరావు, సుజాత, శేషగిరిరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కోటిరెడ్డి, శివారెడ్డి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రతి ఒక్కరూ భాగస్వాములుకావాలి

రేపల్లె రూరల్: గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మల్లికార్జునరావు పేర్కొన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్థాయి అధికారులతో సదస్సు నిర్వహించి, మాట్లాడారు. మోర్లవారిపాలెం పంచాయతీకి హరిత గ్రామంగా, నీటి సంవృద్ధి కలిగిన అవార్డులు వచ్చాయని తెలిపారు. పేటేరు పంచాయతీకి స్వయం సంవృద్ధితో మౌలిక సదుపాయాల గ్రామంగా అవార్డు వచ్చిందన్నారు. ఆయా పంచాయతీల అధికారులను సత్కరించారు. బేతపూడి పంచాయతీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీపీ పెనుమాల సుశీల, జెడ్పీటీసీ బొర్రా లక్ష్మీ శ్రీనివాసరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మెరుగైన పరిపాలనకు ప్రాధాన్యమివ్వాలి

కొల్లూరు: పంచాయతీ పరిధిలో ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడానికి సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రాధాన్యమివ్వాలని ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు పేర్కొన్నారు. సోమవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించారు. సర్పంచ్‌లు, కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈఓపీఆర్‌డీ రవి, వైఎస్సార్ సీపీ నాయకుడు కమ్మెల సాంబయ్య పాల్గొన్నారు.

పంచాయతీల బలోపేతానికి ప్రభుత్వం కృషి

బాపట్ల: పంచాయతీల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఇటీసీలో గాంధీ, డాక్టరు బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పరిపాలనలో స్థానిక సంస్థలకు చోటు కల్పిస్తూ.. 73వ రాజ్యాంగ సవరణ బిల్లు అమల్లోకి వచ్చిందన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం పంచాయతీరాజ్ సంస్థల ద్వారానే సుసాధ్యమైనదని అన్నారు. సచివాలయ వ్యవస్థను స్థాపించి స్థానిక పరిపాలన సంస్థలకు పెద్దపీట వేయటం ద్వారా మహాత్ముని ఆశయాలను ఆచరణలోనికి తెచ్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి చెందుతుందని, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు స్థానిక ప్రభుత్వాలే కీలకమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విస్తరణ శిక్షణ కేంద్రం బాపట్ల బోధన సిబ్బంది కె. లలిత, కె. శ్రీనివాసరావు, విస్తరణ శిక్షణ పొందుతున్న జిల్లా పంచాయతీ అధికారి సౌజన్య, 34 మంది మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

బాపట్ల అర్బన్: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం బాపట్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, గౌరవ అతిథులుగా జెడ్పీటీసీ సభ్యురాలు పిన్నిబోయిన ఎస్తేరు రాణి, మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షురాలు కుర్రా రమాదేవి, ఈవోపీఆర్డీ పులి శరత్‌బాబు పాల్గొన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంతో పాటు వివిధ అంశాలలో ప్రతిభ కనపరిచిన వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, క్లాప్ మిత్రలకు ఐటీసీ, సెర్ప్ సంస్థల సౌజన్యంతో అవార్డులు ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలను సన్మానించారు.

మెరుగైన సేవలకే అవార్డులు

కర్లపాలెం: జాతీయ పంచాయతీరాజ్ వారోత్సవాల్లో భాగంగా అవార్డులకు ఎంపికైన సర్పంచ్‌లకు, కార్యదర్శులకు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ వనజ, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ డి.రాంబాబు అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎంపీడీవో రాంబాబు మాట్లాడుతూ దమ్మనవారిపాలేనికి మండల, జిల్లా స్థాయి అవార్డులు వచ్చాయని తెలిపారు. కర్లపాలెం, ఏట్రవారిపాలెం, పెదగొల్లపాలెం, నాగరాజుపాలెం, యాజలి, పాతనందాయపాలెం, చింతాయపాలెం, పేరలిపాడు గ్రామ పంచాయతీలకు మండలస్థాయి అవార్డులు వచ్చాయన్నారు. ఈఓపీఆర్డీ ఎలీషాబాబు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

చుండూరు(వేమూరు): చుండూరు గ్రామ సర్పంచ్ వుయ్యూరి అప్పిరెడ్డి పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను, గ్రామ సచివాలయం సిబ్బందిని సత్కరించి, సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెనిగళ్ల మాధవి, ఎంపీటీసీ గొర్రెపాటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ రాజ్ కార్యదర్శి నాగభూషణం, ఎ.రాజేష్ పాల్గొన్నారు.